ప్రజాశక్తి
శుక్రవారం 15 డిసెంబరు 2023
5
శ్రీకాకుళం



కరువు జిల్లాగా ప్రకటించాలి



నిరసన తెలుపుతున్న వామపక్ష నాయకులు

ప్రజాశక్తి - పలాస

శ్రీకాకుళం జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలని వామపక్ష, రైతు, ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. కరువు జిల్లాగా ప్రకటించాలని, జీడిపిక్కలకు మద్దతు ధర కల్పించాలని, సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయాలని, వంశధార కాలువను ఆధునీకరించి ఇచ్ఛాపురం వరకు పొడిగించాలని డిమాండ్ చేస్తూ వామపక్షాలు, రైతు, ప్రజాసంఘాల నాయకులు గురువారం నిరసన కార్యక్రమం చేపట్టారు. పలాసలో సిఎం బహిరంగ సభకు సమీపాన ప్లకార్డులను ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో కరువుఛాయలు అలుముకున్నాయని, లోటు వర్షపాతం నమోదైందన్నారు. వంశధార, బాహుదా, మహేంద్రతనయ నదులను ఇచ్ఛాపురం వరకు తీసుకెళ్లాలని డిమాండ్ చేశారు. వంశధార ఆధునికీకరణ చేస్తే రెండు లక్షల ఎకరాల వరకు నీరందుతుందని తద్వారా జిల్లాలో వలసలను నివారించవచ్చన్నారు. ఉద్దానం ఏజెన్సీ ప్రాంతంలో జీడిపంట జీవనాధారంగా రైతులు జీవిస్తున్నారని, 80 కేజీల జీడిపిక్కల బస్తాకు రూ.16 వేల గిట్టుబాటు ధర కల్పించాలని, ప్రభుత్వమే రైతుభరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె.మోహనరావు, సిపిఐ నాయకులు చాపర వెంకటరమణ, వేణుగోపాల్, న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి వంకల మాధవరావు, సిపిఐ ఎంఎల్ లిబరేషన్ నాయకులు మద్దిల రామారావు, రైతుసంఘం నాయకులు టి.భాస్కరరావు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు డి.భాస్కరరావు, ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జి.వాసు, కె.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కిడ్నీ ఆస్పత్రి దేశానికే తలమానికం

"ఉద్దానం అంటే ఉద్యానాల వనం. అటువంటి పచ్చని ప్రాంతాన్ని కిడ్నీ మహమ్మారి ప్రజల జీవితాలను అల్లకల్లోలం చేసింది. ఈ పరిస్థితిని నా పాదయాత్రలో కళ్లారా చూశా. ఈ ప్రాంతంలో పాదయాత్ర సమయంలో ప్రజల గోడు చెప్పినప్పుడు నేను చెప్పిన మాట నేను చూశాను, నేను విన్నాను, నేను ఉన్నాను. 2018 డిసెంబర్ 30 తేదీన ఇచ్చిన మాట ప్రకారం 200 పడకల ఆస్పత్రి నిర్మించి, సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించి మీ ఎదురుగా నిలబడినందుకు గర్వపడుతున్నా"



- దశాబ్దాల సమస్యకు పరిష్కారం చూపాం
- ఫిబ్రవరిలో ఆస్పత్రిలో శస్త్రచికిత్సలు
- ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి వెల్లడి
- కిడ్నీ సూపర్ స్పెషాల్టీ ఆస్పత్రి, రీసెర్చ్ సెంటర్, సుజలధార ప్రాజెక్టు ప్రారంభం
- పలాస నియోజకవర్గానికి పలు వరాలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి, పలాస, కంచిలి, వజ్రపుకొత్తూరు

ఉద్దానం కిడ్నీ సూపర్ స్పెషాల్టీ ఆసత్రి, రీసెర్చ్ సెంటర్‌లో వచ్చే ఫిబ్రవరి నుంచి శస్త్రచికిత్సలను ప్రారంభించి దేశానికే తలమానికంగా నిలిపేందుకు చిత్తశుద్ధితో పనిచేస్తున్నామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అన్నారు. పలాసలో రూ.85 కోట్లతో నిర్మించిన కిడ్నీ సూపర్ స్పెషాల్టీ ఆస్పత్రి, రీసెర్చ్ సెంటర్, కంచిలి మండలం మకరాంపురంలో రూ.700 కోట్లతో నిర్మించిన వైఎస్సార్ సుజలధార ప్రాజెక్టును గురువారం ప్రారంభించారు. అనంతరం కాశీబుగ్గ రైల్వే క్రీడా మైదానంలో నిర్వహించిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. రీసెర్చ్ సెంటర్‌లో కిడ్నీ వ్యాధిగ్రస్తుల చికిత్స కోసం అన్ని విభాగాలతో పాటు డయాలసిస్ సెంటర్లు, ఆపరేషన్ థియేటర్లు మెరుగైన ప్రమాణాలతో ఏర్పాటు చేశామని, బాధితులు తమ ఆరోగ్య అవసరాలకు ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేదంటూ ఆయన భరోసా ఇచ్చారు. జిల్లాలోని కిడ్నీ వ్యాధులను గుర్తించేందుకు ఏడు మండలాల్లో క్రమం తప్పకుండా స్క్రీనింగ్ చేయిస్తామని చెప్పారు. కిడ్నీ వ్యాధిగ్రస్తులకు అవసరమైన 37 రకాల ఔషధాలను స్థానికంగా ఉన్న అన్ని పిహెచ్‌సిల మొదలు, రీసెర్చ్ సెంటర్ వరకు అందుబాటులో ఉంచి ఉచితంగా ఇంటి వద్దకే అందిస్తామని తెలిపారు. ఉద్దానం కిడ్నీ వ్యాధిగ్రస్తుల వైద్య ఖర్చులు, ఆర్థిక ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని అధికారంలోకి వచ్చిన వెంటనే పింఛన్‌ను రూ.2,500 నుంచి రూ.పది వేలకు వేలకు పెంచామని గుర్తుచేశారు.

శాశ్వత పరిష్కారం కోసం రక్షిత మంచినీరు

ఉద్దానం కిడ్నీ సమస్య శాశ్వత పరిష్కారం కోసం రూ.700 కోట్లు ఖర్చు చేసి ఏడు మండలాల్లోని 807 గ్రామాలకు సురక్షిత నీరు అందించే వైఎస్సార్ సుజలధార ప్రాజెక్టు ద్వారా సురక్షిత నీరు అందిస్తున్నట్లు తెలిపారు. రెండో దశ కింద రూ.265 కోట్లతో పాతపట్నం నియోజకవర్గంలోని 448 గ్రామాలకు రక్షిత మంచినీటి అందించనున్నామని తెలిపారు. 2014 నుంచి 2019 వరకు కలిసి పొత్తులతో సాగిన టిడిపి ప్రభుత్వంలో ఉద్దానం కిడ్నీ సమస్య ఎందుకు పరిష్కరించలేదని ప్రశ్నించారు.

ఉత్తరాంధ్ర అభివృద్ధిని అడ్డుకుంటున్నారు

విశాఖను పరిపాలనా రాజధానిగా చేసేందుకు ప్రయత్నిస్తుంటే, ప్రతిపక్షంలో ఉంటూ రెండు పార్టీలు అడ్డుకుంటున్నాయని విమర్శించారు. ఉత్తరాంధ్రలో ఓ బిల్డింగ్ కట్టినా, అభివృద్ధి చేసినా, సిఎంగా ఇక్కడే వచ్చి ఉంటానన్నా, మెడికల్ కాలేజీలు, పోర్టులు, ఎయిర్‌పోర్టులు కడతామన్నా ఓర్వలేకపోతున్నారని చెప్పారు. రాష్ట్రాన్ని పెత్తందారులుగా మారి దోచుకోవాలని చూస్తున్న నాన్ లోకల్ పొలిటీషియన్లను వచ్చే ఎన్నికల్లో శాశ్వతంగా తరిమికొట్టాలని పిలుపునిచ్చారు.



కిడ్నీ సూపర్ స్పెషాల్టీ వద్ద ప్రజాప్రతినిధులతో సిఎం జగన్మోహన్ రెడ్డి

ఇది అభివృద్ధి కాదా..?


ఉద్దానం ప్రాంతంలో కిడ్నీ మహమ్మారితో వేలాది మంది మృత్యువాత పడ్డారని మత్స్య, పశు సంవర్ధక శాఖ మంత్రి సీదిరి అప్పలరాజు తెలిపారు. ఆస్పత్రి, రీసెర్చ్ సెంటర్ ఏర్పాటుతో ప్రజల కష్టాలు నేటితో తీరనున్నాయని చెప్పారు. వైసిపి ప్రభుత్వం సంక్షేమం తప్ప అభివృద్ధి చేయడం లేదని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయని, కిడ్నీ ఆస్పత్రి, రీసెర్చ్ సెంటర్, సుజలధార ప్రాజెక్టు అభివృద్ధిలో భాగం కాదా అని ప్రశ్నించారు. ఎమ్మెల్యే అభ్యర్థులను మార్చడంపై ప్రతిపక్షాలు వక్రభాష్యాలు చెప్తున్నాయని, వైసిపిలో ప్రతి ఎమ్మెల్యే గెలవాలి... జగన్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలన్నదే తమ ఆశయమన్నారు. తన నియోజకవర్గంలో మార్చినా అభ్యర్థిని గెలిపించుకు వస్తామని చెప్పారు.

కిడ్నీ ఆస్పత్రి, రీసెర్చ్ సెంటర్ ఏర్పాటుతో ఉద్దానం ప్రాంత ప్రజల కలలు సాకారమయ్యాయని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ అన్నారు. హిరమండలం నుంచి పైపుల ద్వారా సురక్షితమైన తాగునీటిని ఎనిమిది మండలాల ప్రజలకు తరలించేందుకు రూ.700 కోట్లు వెచ్చించినట్లు వివరించారు.

పలాసకు పలు వరాలు

పలాస నియోజకవర్గానికి సంబంధించి పలు అంశాలకు నిధులు కేటాయించాలని మంత్రి అప్పలరాజు చేసిన విజ్ఞప్తికి ముఖ్యమంత్రి స్పందించారు. మూలపేట పోర్టు కనెక్టివిటీకి నౌపడ-వెంకటాపురం డబుల్ రోడ్డు చేయడానికి రూ.ఐదు కోట్లు, మదనగోపాలసాగరం లిఫ్ట్ ఇరిగేషన్‌కు రూ.60 కోట్లు, బెండి లిఫ్ట్ ఇరిగేషన్‌కు రూ.ఏడు కోట్లు మంజూరు చేశారు.

కుటుంబసభ్యులకు అనుమతి నిరాకరణ



కిడ్నీ ఆస్పత్రి సమీపంలో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్ వద్దకు సిఎంకు ఆహ్వానం పలికేందుకు వెళ్తున్న మంత్రి అప్పలరాజు కుటుంబసభ్యులకు చేదు అనుభవం ఎదురైంది. మంత్రితో పాటు ఆయన సతీమణి శ్రీదేవి, కుమారులు వెళ్తుండగా పోలీసులు అడ్డుకున్నారు. అక్కడికి వెళ్లే వారి జాబితాలో మంత్రి కుటుంబ సభ్యుల పేర్లు లేవని స్పష్టం చేశారు. దీంతో మంత్రి అలిగి అక్కడ్నుంచి కిడ్నీ ఆస్పత్రి వద్దకు వెళ్లిపోయారు. శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం తనయుడు చిరంజీవినాగ్, రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు తనయుడు రామ్ మనోహర్ నాయుడును హెలీప్యాడ్ వద్దకు వెళ్లకుండా పోలీసులు అడ్డుకున్నారు.

అభివృద్ధి పనుల శిలాఫలకాలు ఆవిష్కరణ

సభా ప్రాంగణం వద్ద పలు అభివృద్ధి పనుల శిలాఫలకాలను సిఎం ఆవిష్కరించారు. ఎచ్చెర్లలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విశ్వ విద్యాలయంలో రూ.18 కోట్లతో నూతనంగా నిర్మించిన వైఎస్సార్ బాలుర వసతిగృహానికి సంబంధించి ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. పలాసలో 60.8 ఎకరాల్లో ఏర్పాటు చేస్తున్న పారిశ్రామిక క్లస్టర్‌ను ప్రారంభించారు.

ట్రాఫిక్ ఆంక్షలతో అవస్థలు

సిఎం పర్యటన సందర్భంగా పలాస-కాశీబుగ్గలో విధించిన ట్రాఫిక్ ఆంక్షలతో ప్రజలకు అవస్థలు తప్పలేదు. బస్సులను రెండు కిలోమీటర్ల దూరంలో ఆపేయడంతో చిన్నారులు, వృద్ధులు ఇబ్బంది పడ్డారు. సిఎం పర్యటనకు ఆర్‌టిసి బస్సులను వినియోగించడంతో రవాణా ఇబ్బందులు తప్పలేదు. బహిరంగ సభకు వచ్చిన ప్రజలకు పూర్తిస్థాయిలో తాగునీరు, భోజన సౌకర్యం కల్పించలేదు. సిఎం ప్రయాణించే మార్గంలో దుకాణాలను మూసివేయించారు.

సిఎంకు ఘన స్వాగతం

జిల్లాకు పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రికి ప్రజాప్రతినిధులు, అధికారులు ఘన స్వాగతం పలికారు. శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం, ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలరావు, వైద్యారోగ్యశాఖ మంత్రి విడదల రజని, రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు, పశుసంవర్ధకశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు, ప్రభుత్వ విప్ పాలవలస విక్రాంత్, ఎమ్మెల్సీలు శ్రీనివాస్, నర్తు రామారావు, వరుదు కళ్యాణి, ఎమ్మెల్యేలు ధర్మాన కృష్ణదాస్, వి.కళావతి, కంబాల జోగులు, రెడ్డి శాంతి, గొర్లె కిరణ్‌కుమార్, శ్రీకాకుళం, విజయనగరం జెడ్‌పి చైర్మన్లు పిరియా విజయ, మజ్జి శ్రీనివాసరావు, వైద్యారోగ్యశాఖ కార్యదర్శి ఎం.టి కృష్ణబాబు, కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్, డిఐజి హరికృష్ణ, ఎస్‌పి జి.ఆర్ రాధిక, జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ కమర్ తదితరులున్నారు.



విన్నపాలకు వదల్లేదు

సిఎంను కలిసి తమ సమస్యలు చెప్పుకోవాలని ప్రయత్నించిన పలువురికి నిరాశే ఎదురైంది. తన రెండెకరాల భూమిని కౌన్సిలర్లు ఆక్రమించుకున్నారని సిఎంకు ఫిర్యాదు చేసేందుకు వెళ్లిన కాశీబుగ్గకు చెందిన సైని చిన్నమ్మను పోలీసులు అడ్డుకున్నారు. జలుమూరు మండలం కరకవలసకు చెందిన పేరాడ అమ్మన్న వికలాంగురాలైన తన కుమార్తె సాయికృష్ణవేణిని తీసుకొచ్చి జగన్‌ను కలవాలని కోరినా సెక్యూరిటీ అడ్డుకున్నారు. విధి నిర్వహణలో ప్రమాదవశాత్తు బస్సు కింద పడి కాలు పోగొట్టుకున్న తనకు శాఖాపరమైన తోడ్పాటు అందలేదని, ప్రభుత్వం తరుపున ఆదుకోవాలని సిఎంను కలిసేందుకు వెళ్లిన సోంపేటకు చెందిన ఆర్‌టిసి కండక్టర్ కె.మోహనరావును పోలీసులు అడ్డుకోవడంతో కన్నీటిపర్యంతమయ్యాడు.



బహిరంగ సభకు హాజరైన ప్రజలు



ధర్నా శిబిరం వద్ద రాత్రి చలిలోనే నిద్రిస్తున్న ఆశావర్కర్లు



వంటావార్పు చేస్తున్న ఆశావర్కర్లు

'ఆశా'ల ఆందోళన

కలెక్టరేట్ వద్ద 36 గంటల ధర్నా, వంటావార్పు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

కనీస వేతనాలు చెల్లించాలని, పనిభారాన్ని తగ్గించాలని డిమాండ్ చేస్తూ ఆశావర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన ఆశావర్కర్లు గురువారం కలెక్టరేట్ వద్ద 36 గంటల ధర్నా చేపట్టారు. ఆందోళనలో భాగంగా వంటావార్పు కార్యక్రమం చేపట్టి అక్కడే భోజనాలు చేసి రాత్రి వణికిస్తున్న చలిలోనూ అక్కడే నిద్రించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు కె.నాగమణి, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి.ధనలక్ష్మి, జి.అమరావతి మాట్లాడుతూ ఆశావర్కర్లకు కనీస వేతనాలు, ప్రభుత్వ సెలవులు, రిటైర్మెంట్, గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, సంక్షేమ పథకాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆశావర్కర్ల నియామకాల్లో రాజకీయ జోక్యాన్ని తొలగించి, ప్రభుత్వమే నియామకాలు చేపట్టాలన్నారు. రిటైర్మెంట్ కాలాన్ని 62 ఏళ్లకు పెంచడంతో పాటు రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని డిమాండ్ చేశారు. 18 ఏళ్లుగా ప్రజలకు ఆరోగ్య సేవలందిస్తున్నా, ఆశావర్కర్లను ప్రభుత్వం కార్మికులుగా గుర్తించడం లేదన్నారు. తక్షణమే కార్మికులుగా గుర్తించి ఇతర సౌకర్యాలను కల్పించాలని డిమాండ్ చేశారు. 60 ఏళ్ల వచ్చే వరకు పనిచేయించుకుని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించకుండానే తొలగించడం సరికాదన్నారు. విధినిర్వహణలో ప్రమాదవశాత్తు, అనారోగ్యంతో చాలామంది ఆశావర్కర్లు అర్ధాంతరంగా చనిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఆశావర్కర్లకు గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలన్నారు. గిరిజన ప్రాంతాల్లో పనిచేస్తున్న కమ్యూనిటీ హెల్త్ వర్కర్లను ఆశాలుగా మార్పు చేయాలని డిమాండ్ చేశారు. ఆశావర్కర్లను రోజూ విలేజ్ క్లినిక్, సచివాలయాల్లో ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఉండాలని, క్లినిక్‌లు క్లీన్ చేయడం, ఒపి వర్క్, అటెండర్ పనులు, రెండుపూటలా రిజిస్టర్‌లో సంతకాలు చేయాలని అధికారులు వేధిస్తున్నారని విమర్శించారు. ఆశావర్కర్లకు సంబంధం లేని పనులు చేయించడం ఆపాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి సమస్యలు పరిష్కరించాలన్నారు. ఎఎన్ఎం, హెల్త్ సెక్రటరీల నియామకాల్లో ఆశాలకు వెయిటేజీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆశావర్కర్ల పోరాటానికి సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎ.మహాలక్ష్మి, మధ్యాహ్న భోజన పథకం జిల్లా ఉపాధ్యక్షులు పి.పద్మావతి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జి సింహాచలం, యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిషోర్ కుమార్ తదితరులు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు పి.జయలక్ష్మి, సిహెచ్.లక్ష్మి, పి.జయలక్ష్మి, ఆర్.కాంతమ్మ, పి.దమయంతి, ఎస్.గౌరమ్మ తదితరులు పాల్గొన్నారు.

వైసిపికి కౌంట్‌డౌన్ మొదలు

టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కె.అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి - కోటబొమ్మాళి, ఆమదాలవలస

రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వానికి కౌంట్‌డౌన్ మొదలైందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు, టెక్కలి ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. కోటబొమ్మాళిలోని టిడిపి కార్యాలయంలో టెక్కలి నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగున్నరేళ్లలో ఆంధ్రప్రదేశ్‌ను అథ:పాతాళానికి తొక్కిన శని ఎప్పుడు పోతుందా అని ఐదు కోట్ల ప్రజానీకం ఎదురుచూస్తోందని చెప్పారు. ఎన్నికల్లో మోసపూరిత హామీలు ఇచ్చి అందులో 38 శాతం మాత్రమే నెరవేర్చారని విమర్శించారు. రాష్ట్రంలో మహిళలు, దళితులు, గిరిజనులపై దాడులు, హత్యలు, అత్యాచారాలు పెరిగాయని ఆరోపించారు. ఉద్దానానికి ఎంతో ఉద్ధరిస్తున్నామని చెప్పి డబ్బాలు కొట్టుకోవడానికి సిగ్గుండాలన్నారు. టిడిపి హయాంలో 16 ఎత్తిపోతల పథకాల ద్వారా జిల్లాను సస్యశ్యామలం చేస్తే, వైసిపి పాలనలో వాటిని వినియోగించడం చేతకాక జిల్లాను కరువు జిల్లాగా మార్చారని దుయ్యబట్టారు. జిల్లాలో ఒక్క మండలాన్నీ కరువు మండలంగా ప్రకటించకపోవడం జిల్లాలోని మంత్రులు, వైసిపి నాయకుల అసమర్థతకు నిదర్శనమన్నారు. సమావేశంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి బోయిన గోవిందరాజులు, పినకాన అజయ్‌కుమార్, బగాది శేషగిరి, బోయిన రమేష్, జీరు భీమారావు, వి.కామేశ్వరరావు, టి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

యువగళం ఎన్నికల శంఖారావానికి తరలిరావాలి

యువగళం ముగింపు సభకు వేలాది మంది టిడిపి నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని మాజీ మంత్రి కె.ఎస్ జవహర్ పిలుపునిచ్చారు. ఆమదాలవలస మండలం కొర్లకోట రోడ్డులోని ఒక ఫంక్షన్‌హాల్‌లో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. విజయనగరం జిల్లా నెల్లిమర్ల మండలం పోలిపల్లి భూమాత వెంచర్‌లో యువగళం ముగింపు భారీ బహిరంగ సభను నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో టిడిపి జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్, మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వప్రసాద్, నాయకులు మొదలవలస రమేష్, తమ్మినేని విద్యాసాగర్, సనపల ఢిల్లేశ్వరరావు, నూక రాజు, ఆనెపు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అచ్చెన్నాయుడు

నేడు, రేపు జాతీయ సదస్సు

ప్రజాశక్తి - శ్రీకాకుళం రూరల్

'ఆహార భద్రత, సుస్థిరమైన గ్రామీణ జీవనోపాధికి వ్యవసాయ ఆవిష్కరణలు' అనే అంశంపై మండలంలోని నైరలో గల ఆచార్య ఎన్‌జి రంగా విశ్వవిద్యాలయంలో ఈనెల 15, 16న జాతీయ సదస్సును నిర్వహిస్తున్నట్లు ఉద్యానవన శాఖ డైరెక్టర్ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. డైమండ్ జూబ్లీ, భారత ప్రభుత్వం 'అమృత్‌కాల్' సందర్భంగా ప్రపంచ వాతావరణ మార్పులు, యుఎన్‌డిపి సుస్థిర అభివృద్ధి లక్ష్యాల నేపథ్యంలో రైతులకు ఆధునిక సాంకేతికతను అవలంభించి జీవన ప్రమాణాల మెరుగుకు సదస్సు తోడ్పడుతుందని పేర్కొన్నారు. రెండు రోజుల సదస్సు హైబ్రిడ్ మోడ్ (ఆఫ్ లైన్ మరియు వర్చువల్) ద్వారా పలు అంశాలపై చర్చిస్తామని తెలిపారు.



ప్రశంసాపత్రం అందజేస్తున్న డైరెక్టర్, సిబ్బంది

పల్లవికి అభినందనలు

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఐఐఐటిలో మొదటి సంవత్సరం చదువుతున్న సిహెచ్ పల్లవి ఫెన్సింగ్ పోటీలో గోల్డ్ మెడల్ కైవసం చేసుకోవడంతో డైరెక్టర్ ప్రొఫెసర్ కొక్కిరాల వెంకట గోపాల ధన బాలాజీ అభినందించారు. ఈ నెల 8న విజయనగరంలో జరిగిన ఫెన్సింగ్ అండర్-17 మీట్ పోటీల్లో పాల్గొని వ్యక్తిగత విభాగంలో గోల్డ్ మెడల్ సాధించి ఈ నెల గుజరాత్‌లో జరుగనున్న నేషనల్ ఫెన్సింగ్‌కు అర్హత సాధించింది. ఈ సందర్భంగా డైరెక్టర్ ప్రొఫెసర్ మాట్లాడుతూ పల్లవి ఉన్నతమైన స్థాయికి చేరుకోవాలని, తద్వారా యూనివర్సిటీకి మంచి పేరు తీసుకురావాలన్నారు. ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం రాజు, దిలీప్ కుమార్ విద్యార్థులను స్పోర్ట్స్‌లో శిక్షణ అందిస్తున్నారన్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయికి వెళ్లే విధంగా మెలుకువలతో కూడిన శిక్షణ అందజేయాలన్నారు. కార్యక్రమంలో ఓఎస్‌డి సుధాకర్ బాబు, పరిపాలన అధికారి ముని రామకృష్ణ, డీన్ మోహన్ కృష్ణ చౌదరి, ఫైనాన్స్ ఆఫీసర్ అసిరి నాయుడు, డీన్ వెల్ఫేర్ రవి, కృష్ణరాజు, దిలీప్, షణ్ముకరావు పాల్గొన్నారు.



ఎంపికైన విద్యార్థులతో ఎంఇఒలు

రాష్ట్రస్థాయి క్విజ్ పోటీలకు ఎంపిక

నందిగాం: మండలంలోని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సిక్కోలు గణిత ఉపాధ్యాయ సంఘం, ఎపి గణిత ఉపాధ్యాయుల ఫోరమ్ ఆధ్వర్యాన జిల్లా స్థాయి గణిత క్విజ్ నిర్వహించారు. ఈ పోటీలో జిల్లా నుంచి 31 మండలాల నుంచి విద్యార్థులు పాల్గొన్నారని జిల్లా క్విజ్ పోటీల అధ్యక్షులు వై.హరిబాబు తెలిపారు. వారిలో స్క్రీనింగ్ టెస్టు నిర్వహించి పది పాఠశాల విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించామన్నారు. 8, 9, 10 తరగతుల విద్యార్థులకు ఒక్కొక్కరికి చొప్పున ఎంపిక చేశామని అన్నారు. జిల్లాస్థాయి విజేతలకు ఈ నెల 16న శ్రీకాకుళంలో జరుగు రాష్ట్రస్థాయి గణిత క్విజ్ పోటీల్లో జిల్లా జట్టు తరుపున పాల్గొంటారని తెలిపారు. జె.సంజయ్ (సోంపేట), జె.సుశాంత్, టి.ఉదయ్‌కిరణ్ (తాడివలస)లు ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఈ పోటీలో టెక్కలి, నందిగాం ఎంఇఒలు జి.నరసింహులు, ఎ.చిన్నారావు, డి.తులసీరావు, డి.చిన్నారావు, గణిత శాస్త్ర ఉపాధ్యాయులు శాస్త్రి సాయిరాం, ప్రసాద్ కుమార్‌లు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న కళాజాత బృందం

సైబర్ మోసాలపై అప్రమత్తం

సరుబుజ్జిలి : సైబర్ మోసాల పట్ల ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సిఎఫ్ఎల్ కో-ఆర్డినేటర్ చిగురుపల్లి వెంకటేష్ (విన్ను) అన్నారు. గురువారం మండలంలోని విన్న కాగితాపల్లి గ్రామంలో ఆర్‌బిఐ పథకంలో భాగంగా యూనియన్ బ్యాంకు సౌజన్యంతో ఎన్ఎసిటి స్వచ్ఛంద సంస్థ నిర్వహణలో కళాజాత బృందసభ్యులు కె.శంకరరావు, కె.సత్యనారాయణ, ఎం.లక్ష్మి ఆర్థిక అక్షరాస్యతపై స్వయంశక్తి సంఘాల సభ్యులకు బ్యాంకు లావాదేవీలు, పథకాలపై అవగాహన కల్పించారు. బ్యాంకు నుంచి మాట్లాడుతున్నామని ఎవరైనా ఫోన్ చేసి ఓటిపి, ఎటిఎం వివరాలు అడిగితే అటువంటి వారికి సమాచారం ఇవ్వవద్దని సూచించారు. బ్యాంకు అధికారులు ఎప్పుడూ ఖాతాదారుల వివరాలను ఫోన్ చేసి తెలుసుకోరన్నారు. ఎటిఎంల్లో అపరిచితులకు కార్డు ఇచ్చి డబ్బులు విత్‌డ్రా చేయించరాదన్నారు. రూపే ఎటిఎం కార్డుల ప్రయోజనాలను ప్రజలకు వివరించారు. బ్యాంకులో అమలవుతున్న ప్రధానమంత్రి జీవనజ్యోతి, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన ఇన్సూరెన్స్ పథకాల వివరాలను క్లుప్తంగా వివరించారు. సైబర్ మోసాలకు గురైనప్పుడు 1930, ఇంటిగ్రేటెడ్ అంబుడ్స్ మెన్ 14448 టోల్ ఫ్రీ నంబర్లకు ఫోన్‌చేసి ఫిర్యాదు చేయవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో సచివాలయ మహిళా పోలీస్ భాగ్యలక్ష్మి, అగ్రికల్చర్ అసిస్టెంట్ లత, సిఎఫ్ ఎస్.రమణమ్మ, సిఎఫ్ఎల్ కో-ఆర్డినేటర్ రామారావు పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయాలి

ఆమదాలవలస : గ్రంథాలయాల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సువ్వారి సువర్ణ సిఎం జగన్మోహన్‌రెడ్డిని కోరారు. గురువారం జిల్లాలో పలాస సందర్శనకు వచ్చిన సిఎం జగన్మోహన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లాలో గ్రంథాలయాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని కోరారు. జిల్లాలో గ్రంథాలయాల్లో కొన్నేళ్లుగా పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్, పార్ట్ టైం ఉద్యోగులు, సేవకులను రెగ్యులర్ చేయాలని కోరుతూ సిఎంకు వినతిపత్రం అందజేశారు. సమస్యలపై ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

చంద్రబాబును కలిసిన మహేష్

లావేరు : మాజీ సిఎం, టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడును అప్పాపురం మాజీ సర్పంచ్, మండల తెలుగుయువత అధ్యక్షుడు గుంట్యాడ మహేష్ గురువారం మంగళగిరి టిడిపి కేంద్ర కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా రానున్నది టిడిపి ప్రభుత్వమేనని, ఎన్నికల్లో యువత కష్టపడి పని చేయాలని, ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాల పట్ల ప్రజలకు వివరించాలన్నారు. టిడిపి ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపర్చిన పథకాలను ప్రజలు, మహిళలు, నిరుద్యోగులు, రైతులకు వివరించాలని చెప్పారు. పార్టీలో కష్టపడి పని చేసేవారికి భవిష్యత్‌లో గుర్తింపు గౌరవం ఇవ్వడం జరుగుతుందన్నారు.

గ్రానైట్ అనుమతులు రద్దు చేయాలి

మెళియాపుట్టి : మండలంలోని జలకలింగపురం సమీపంలోని ఇంజాడ అమ్మవారి కొండపై గ్రానైట్ అనుమతులను తక్షణమే రద్దు చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. జలకలింగపురం, మర్రిపాడు-సి, ముకుందపురం, బంజీరు గ్రామస్తులకు చెందిన మహిళలు ఇంజాడ అమ్మవారి కొండకు ముర్రాటలతో ఊరేగింపుగా వెళ్లి కొండ వద్ద గురువారం పూజలు చేశారు. తమకు ఆరాధ్య దైవంగా ఉండే ఇంజాడి కొండపై గ్రానైట్ అనుమతులను తక్షణం రద్దు చేయాలని నినాదాలు చేశారు. ప్రజల విశ్వాసాన్ని కాదని గ్రానైట్ తవ్వకాలు చేపడితే ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. అలాగే ఇంజాడి కొండ భాగం వద్ద పంచాయతీకి ఎటువంటి సంబంధం లేదని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు రవ్వల అమారాధ, సవర భాస్కరరావు, మండల జనసేన నాయకులు దుక్క బాలరాజు, రైతు కూలీ సంఘం నాయకులు బైరి కూర్మారావు, రవ్వల గణపతిరావు, కొల్లి లక్ష్మీనారాయణ, నక్క శ్యాంసుందరరావు పాల్గొన్నారు.



ముర్రాటలతో కొండ వద్ద నినాదాలు చేస్తున్న గ్రామస్తులు

అంగన్వాడీల వినూత్న నిరసన



పొందూరు : సమ్మెకు మద్దతు తెలుపుతున్న రవికుమార్



ఆమదాలవలస : మోకాళ్లపై నిల్చొని నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం విలేకరుల యంత్రాంగం

న్యాయబద్ధమైన తమ డిమాండ్లను పరిష్కరించాలని సమ్మె చేపడుతున్న అంగన్వాడీలపై రాష్ట్ర ప్రభుత్వానికి చిన్నచూపు తగదని టిడిపి జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్ అన్నారు. పొందూరు తహశీల్దార్ కార్యాలయం ముందు సిఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడీలు చేపడుతున్న నిరవధిక సమ్మె గురువారం మూడోరోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన సంఘీభావం తెలిపి మాట్లాడుతూ మినిమం వేతనం చెల్లించడంతో పాటు రిటైర్మెంట్ బెనిఫిట్స్, ఇతర డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చాలన్నారు. టిడిపి మండల అధ్యక్షుడు చిగిలిపల్లి రామ్మోహన్, ఎంపిటిసి-2 అనకాపల్లి వాణి ఉన్నారు. అలాగే అంగన్వాడీలు చేపడుతున్న సమ్మెకు యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పొందూరు అప్పారావు, ఆశాఖ మండల అధ్యక్షుడు గురుగుబెల్లి గోపాలరావు శిబిరం వద్దకు వచ్చి తమ సంఘీభావాన్ని ప్రకటించారు. ఈ సమ్మెలో సిఐటియు మండల అధ్యక్షులు బి.జ్యోతిలక్ష్మి, కె.నాగరత్నం, కృష్ణవేణి, రమ తదితరులు పాల్గొన్నారు.

ఆమదాలవలస పట్టణంలో ఐసిడిఎస్ కార్యాలయం వద్ద అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్లు మోకాళ్లపై నిల్చుని నిరసన తెలిపారు. కార్యక్రమంలో ప్రాజెక్టు కార్యదర్శి పి.భూలక్ష్మి, అంగన్వాడీ యూనియన్ నాయకులు మొదలవలస లత, పి.లక్ష్మి, కనకం, అరుణాకుమారి, కార్యకర్తలు, హెల్పర్లు పాల్గొన్నారు.

అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ రాష్ట్రవ్యాప్త సమ్మెలో భాగంగా 3వ రోజు శ్రీకాకుళం అర్బన్ ఐసిడిఎస్ కార్యాలయం వద్ద కార్యకర్తలు, ఆయా మోకాళ్లపై నిలబడి వినూత్నంగా నిరసన తెలిపారు. సిఐటియు జిల్లా కోశాధికారి అల్లు సత్యనారాయణ, ఎఫ్‌టియు జిల్లా కార్యదర్శి డి.గణేష్‌లు మద్దతు తెలిపారు. ఐక్య పోరాటాల ద్వారానే విజయం సాధిస్తామన్నారు. ప్రభుత్వం వెంటనే చర్చలు జరిపి పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కె.హేమలత, జి.నాగలక్ష్మి, పి.సాయికుమార్, డి.రాజ్యలక్ష్మి, కె.మీనా, టి.స్వాతి, మాలతి, పావని, పి.విజయలక్ష్మి, పి.జ్యోతి పిల్లలను తీసుకుని సమ్మె శిబిరానికి వచ్చి సంఘీభావం తెలిపారు. అంగన్వాడీ సమస్యలను పరిష్కరించి సెంటర్లు తెరిపించాలని ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు కె.కళ్యాణి, కె.ప్రమీలాదేవి, రాజేశ్వరి, కె.కృష్ణభారతి, జి.రాజేశ్వరి, అంజలిభాయ్, సూర్యకుమారి, ఇ.అప్పలనర్సమ్మ, పాల్గొన్నారు.

కొత్తూరు అంబేద్కర్ విగ్రహం వద్ద అంగన్వాడీ కార్యకర్తల నిరవధిక సమ్మెలో భాగంగా మానవహారం, మోకాళ్లపై నిల్చొని నిరసన తెలిపారు. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు రిజని, కె.లక్ష్మి, హేమలత, బోడమ్మ, జలజాక్షి, సుదీష్ణ, రోహిణి, లక్ష్మి, మధుబాల, కామేశ్వరి, అనురాధ, శ్రీలక్ష్మి, ధనలక్ష్మి, భవాని, ప్రజాసంఘాల నాయకులు సిర్ల ప్రసాద్ పాల్గొన్నారు.

టెక్కలిలో ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద చేపట్టిన అంగన్వాడీలు మోకాళ్లపై నిల్చొని నిరసన తెలిపారు. ఈ సమ్మెకు యుటిఎఫ్ జిల్లా కమిటీ గౌరవ అధ్యక్షులు వై.వైకుంఠరావు, ఎఐసిసియు నాయకులు శ్రీను, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి కణితి కిరణ్‌కుమార్‌లు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు నంబూరు షణ్ముఖరావు, పి.ఆదిలక్ష్మి, ఎల్.శ్రీదేవి, బి.రమణమ్మ, టి.కృష్ణవేణి, ఉమాబాయి, పద్మావతి, ఎ.రమా, అనుసూయమ్మ, ఉషారాణి, గౌరి పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం బస్టాండ్ వద్ద చేపట్టిన నిరవధిక సమ్మెలో అంగన్వాడీలు మోకాళ్లపై నొల్చొని నిరసన తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి సంగారు లక్ష్మీనారాయణ, కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

కోటబొమ్మాళి ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం ఎదుట అంగన్వాడీలు చేపట్టిన నిరవధిక సమ్మెలో మోకాళ్లపై నిల్చొని నిరసన తెలిపారు. సమ్మెకు యుటిఎఫ్ నాయకులు కె.వైకుంఠరావు, దాలయ్య, టిడిపి రాష్ట్ర కార్యదర్శి బోయిన గోవిందరాజులు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకుడు హనుమంతు ఈశ్వరరావు కార్యకర్తలు, ఆయా పాల్గొన్నారు.



కోటబొమ్మాళి : మోకాళ్లపై నిల్చొని నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు



టెక్కలి రూరల్ : మాట్లాడుతున్న వైకుంఠరావు



సోంపేట : మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ

సోంపేట గాంధీ మండపం వద్ద చేపట్టిన నిరవధిక సమ్మెలో అంగన్వాడీలు మెకాళ్లపై నొల్చొని నిరసన తెలిపారు. సమ్మెకు సిఐటియు నాయకులు సంగారు లక్ష్మీనారాయణ, యుటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు లండ బాబూరావు సంఘీభావం తెలిపారు.

పలాస ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద చేపట్టిన అంగన్వాడీ నిరవధిక సమ్మెకు ఎఐసిసిటియు జిల్లా కార్యవర్గ సభ్యులు దున్న శ్రీనివాస్ సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి, ఆర్.భవాని, పి.పద్మావతి, బి.నిర్మల, బి.చామంతి, కె.బి.ఇందుమతి, ఆర్.అప్పలనరసమ్మ పాల్గొన్నారు.

సిఎం దృష్టికి సోంపేట సమస్యలు

ప్రజాశక్తి- సోంపేట

సోంపేట మండలంతో పాటు ఇచ్ఛాపురం నియోజకవర్గంలో నెలకొన్న పలు సమస్యలను పరిష్కరించాలని ఎంపిపి డాక్టర్ నిర్మాణ దాసు సిఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డిని కోరారు. గురువారం కంచిలి మండలం మకరాంపురం వైఎస్ఆర్ సుజలధార పథకం ప్రారంభోత్సవానికి విచ్చేసిన సిఎంను కలిసి పలు సమస్యలను వివరించారు. ఇచ్ఛాపురం నియోజకవర్గంలో నాలుగు మండలాల్లో జలవనరులు, పైడిగాం ప్రాజెక్టు శాశ్వత మరమ్మతులు, సోంపేట టౌన్‌లో రోడ్ వైండింగ్ పనులపై వినతిపత్రం అందజేశారు. దీనిపై ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సానుకూలంగా స్పందించారని ఎంపిపి దాసు పేర్కొన్నారు.



సిఎం జగన్‌ను కలిసిన ఎంపిపి దాస్

సోంపేటను కరువు మండలంగా ప్రకటించాలి

సోంపేటను కరువు మండలంగా ప్రకటించాలని జెడ్‌పిటిసి తడక యశోద కోరారు. కంచిలి మండలం మకరాపురంలో నిర్మించిన వైఎస్ఆర్ సుజలధార ప్రారంభోత్సవానికి విచ్చేసిన సిఎం జగన్మోహన్ రెడ్డికి జెడ్‌పిటిసి, మండల వైసిపి నాయకులు, పలాసపురం గ్రామ సర్పంచ్ తడక జోగారావు కలిసి పలు సమస్యలను వివరించి వినతిపత్రం అందజేశారు. పైడిగం ఛానల్ నుంచి పలాసపురం వరకు టైలాండ్ బట్టి సిమెంట్‌తో చేయాలని, మహేంద్ర తనయ నది నుంచి ఎత్తిపోతల పథకం ద్వారా సోంపేట, జింకీభద్ర, బెంకలి, పలాసపురం గ్రామాలకు నీరు అందించాలని, మెయిన్‌రోడ్డు విస్తరించాలని, బారువలో జగనన్న కాలనీ ఇళ్లను సముద్రం ఒడ్డున కాకుండా వేరే దగ్గరికి మార్చాలని కోరారు. సిఎం సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

న్యాయవాదుల నిరసన

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ల్యాండ్ టైట్లింగ్ యాక్టు-23 రద్దు కోరుతూ స్థానిక ఐఎఎల్ యూనిట్, ఇచ్ఛాపురం న్యాయవాదుల సంఘం సంయుక్తంగా గురువారం నిరసన తెలిపారు. ఐఎఎల్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నాగరాజ్ పాత్రో సమన్వయంతో స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఎదుట ప్లకార్డులు చేతబట్టి నిరసన చేపట్టారు. అక్కడ నుంచి పాత బస్టాండ్ కూడలి వరకు నడుచుకుని వెళ్లి అక్కడ నినాదాలు చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజలకు న్యాయం చేయడానికి నిరంతరం పనిచేస్తున్న న్యాయవ్యవస్థను బలోపేతం చేయాలన్నారు. సామాన్యులు, బడుగు, బలహీనుల హక్కులు కాలరాసే విధంగా న్యాయ వ్యవస్థను నిర్వీర్యం చేసేలా రాష్ట్ర ప్రభుత్వం జిఒ నంబరు 512ను తీసుకొచ్చిందన్నారు. న్యాయ వ్యవస్థ ద్వారా ప్రజల హక్కులు నిర్ధారించే అవకాశాలు ఉన్నప్పుడే న్యాయం జరుగుతుందన్నారు. రెవెన్యూ అధికారులకు అటువంటి బాధ్యతలు బదలాయిస్తే... ప్రజలకు తీవ్రమైన నష్టం తప్పదని అన్నారు. ఎవరి భూములు ఏమైపోతాయో, సన్న, చిన్నకారు రైతులు ఎలాంటి తిప్పలు పడి భూములు కోల్పోవాల్సి వస్తుందో ఆలోచన చేయాలని సూచించారు. సుప్రీం కోర్టు సూచనల మేరకు మండల న్యాయస్థానాలు ఏర్పాటు వేగవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో స్థానిక బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఆర్.దేవరాజు, ఎన్.సి.సాహు, న్యాయవాదులు ఎస్.ఎల్.నారాయణ, ఎన్.రమణయ్య, దక్కత కృష్ణమూర్తి, గిన్ని సీతయ్య, ఎన్.వి.ఎస్.రంగారావు, భగవాన్‌దాస్, ప్రహ్లద్, ఎం.కె.సామంత్, బి.సూర్యనారాయణ పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

పోస్టల్ సిబ్బంది సమ్మె



కవిటి : నిరసన తెలుపుతున్న సిబ్బంది

ప్రజాశక్తి- పొందూరు

అఖిల భారత తపాలా ఉద్యోగుల సంఘం(జిడిఎస్) ఎన్ఎఫ్‌పిఇ ఇచ్చిన నిరవధిక సమ్మె పిలుపు మేరకు ఎన్ఎఫ్‌పిఇ యూనియన్ సహాయ కార్యదర్శి బెవర అప్పారావు ఆధ్వర్యంలో గురువారం స్థానిక సబ్ పోస్టాఫీసు ఎదుట నిరసన దీక్ష చేపట్టారు. గ్రామీణ డాక్ సేవకులకు సీనియారిటీ ప్రాతిపదికన వెయిటేజ్ కల్పిస్తూ 2018 జనవరి 1 నుంచి జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే గ్రాడ్యూటీ రూ.5 లక్షలకు పెంచాలన్న న్యాయ సమ్మతమైన డిమాండ్లు వెంటనే అమలు చేయాలని, నగదు రహిత వైద్య సౌకర్యాన్ని కల్పించాలని కోరారు. 12, 24, 36 సంవత్సరాల సర్వీసుకు మూడు పదోన్నతులు కల్పించాలని, కొత్తగా చేరిన జిడిఎస్‌లకు రెండోస్కేల్ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో పొందూరు, లయిదాం సబ్ పోస్టాఫీసుల పరిదిలో జిడిఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

మెళియాపుట్టి: మండలంలోని బాణాపురం, జాడుపల్లి, శేఖరాపురం, పెద్ద లక్ష్మీపురం తదితర గ్రామాల్లో పోస్టల్ సిబ్బంది సమ్మె చేపట్టారు. దీంతో తపాలా సేవలు నిలిచిపోయాయి. సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

శ్రీకాకుళం: జిల్లాలో ప్రధాన కేంద్రాల్లో సమ్మె విజయవంతంగా నిర్వహించారు. సమ్మెకు ఎన్ఎఫ్‌పిఇ అనుబంధ సంఘాలైన గ్రూప్-సి, పోస్ట్‌మేన్ అండ్ ఎంటిఎస్ ఉద్యోగులు సంఘీభావంగా పాల్గొన్నారు. ఈ సమ్మెలో జిడిఎస్ నాయకులు నందికేశ్వరరావు, మూర్తినాయుడు, రామకోటేశ్వరరావు, అప్పారావు, గురన్న, ప్రకాశరావు, తెనేశ్వరరావు, గణపతి, సురేష్, సూరిబాబు పాల్గొన్నారు. ఈ సమ్మెకు గ్రూప్-సి కార్యదర్శి గణపతి, పోస్ట్‌మేన్ అండ్ ఎంటిఎస్ కార్యదర్శి బాబూరావు, పెన్షనర్ల సంఘం నాయకులు చంద్రశేఖర్, జ్యోతీశ్వరరావు, సింహాచలం సంఘీభావం ప్రకటించారు.

ఆమదాలవలస : పట్టణంలో ప్రధాన తపాలా కార్యాలయం వద్ద గ్రామీణ తపాలా ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు బి.శ్రీరామ్మూర్తి అధ్యక్షతన తపాలా ఉద్యోగులు నిరవధిక సమ్మెను చేపట్టారు. కార్యక్రమంలో బి.ఎల్.కె. నాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.



ఇచ్ఛాపురం : సమ్మె చేపడుతున్న సిబ్బంది

కవిటి: తమ సమస్యలు పరిష్కరించాలని తపాలా శాఖకు చెందిన జిడిఎస్ సిబ్బంది నిరవధిక సమ్మె చేపట్టారు. ఈ మేరకు కవిటి తపాలా కార్యాలయం ఎదుట గురువారం ప్లకార్డులు చేతబట్టి తమ నిరసన తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ కమలేష్ చంద్ర కమిటీ సూచించిన అన్ని అంశాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. రోజుకి 8 గంటలు పనితో పాటు గ్రాడ్యుటి రూ.5 లక్షలకు పెంచాలని కోరారు. ఈ నిరసనలో తపాలా సిబ్బంది జె.రంజిత్, పి.కేశవరావు, పూడి వంశీ, కె.మేఘనాథం, బి.నిరోషా పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : స్థానిక పోస్టల్ శాఖ కార్యాలయం వద్ద జిడిఎస్ ఉద్యోగులు నిరవధిక సమ్మె చేపట్టారు. సిబ్బందికి ఉచిత వైద్య సదుపాయం కల్పించాలన్నారు. లక్ష్యాల మేళాల వేధింపులు నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు.

కోటబొమ్మాళి: గ్రామీణ తపాలా ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ స్థానిక పోస్టల్ కార్యాలయం జిడిఎస్ ఉద్యోగులు ప్లకార్డులు చేతబట్టి నిరధిక సమ్మె చేపట్టారు.

పాత మేఘవరంలో చోరీ

ప్రజాశక్తి- సంతబొమ్మాళి

పాత మేఘవరంకు చెందిన తయ్య సోములు ఇంటిలో బుధవారం రాత్రి చోరీ జరిగినట్టు సంతబొమ్మాళి ఎస్ఐ కె.మధుసూదనరావు తెలిపారు. ఫిర్యాదుదారుడు, పోలీస్‌లు తెలిపిన వివరాల ప్రకారం తయ్య సోములు, అతని భార్య రాత్రి ఇంట్లో నిద్రమత్తులో ఉండడంతో ఇంట్లో చొరబడి 5 తులాల బంగారం, రూ.50వేలు నగదు పోయినట్లు వారు తెలిపారు. సోములు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఘటన స్థలాన్ని క్లూస్ టీమ్, టెక్కలి సిఐ సూర్య చంద్ర మౌళి వచ్చి పరిశీలించారు.



దగ్ధమైన ధాన్యాన్ని పరిశీలిస్తున్న రెవెన్యూ సిబ్బంది

వరికుప్ప దగ్ధం

ప్రజాశక్తి- మెళియాపుట్టి


మండలంలో పద్ద గ్రామంలో గురువారం అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో కౌలు రైతు మజ్జి పద్మనాభంకు చెందిన ఎకరా 20 సెంట్లుకు సంబంధించి వరి చేను కుప్ప దగ్ధమైంది. అగ్ని ప్రమాదం ఎలా సంభవించిందన్న విషయం తెలియరాలేదు. సంఘటనా స్థలాన్ని రెవెన్యూ సిబ్బంది సందర్శించారు. సుమారు రూ.50 వేలు నష్టం జరిగిందని అంటున్నారు. చేతికొచ్చిన పంట అగ్నికి ఆహుతైందని బాధితుడు కన్నీరుమున్నీరయ్యాడు.

షిర్డీ సన్నిధిలో నృత్య ప్రదర్శన

ఇచ్ఛాపురం : మహారాష్ట్రలోని షిర్డీ సన్నిధి ఆడిటోరియంలో ఇచ్ఛాపురానికి చెందిన వెంకటేశ్వర మ్యూజిక్ అండ్ డాన్స్ అకాడమిక్ చెందిన చిన్నారుల అద్భుతమైన నాట్య ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. ముందుగా మహాగణపతిం సాయి మధురామృతం, దశావతారం, రామాయణ శబ్దం, ముద్దుగారే యశోద... ఒక్కడే దేవుడు సాయినాథుడు... సిరుల నొసగు జయ జనార్ధన... గరుడ గమన అధివో అల్లదివో... సాయి హారతి తదితర పాటలకు చక్కటి నాట్య ప్రదర్శన నాట్య గురువులు ఏలేశ్వరపు శ్రీనివాసులు ఆధ్వర్యాన నిర్వహించారు. నృత్య గురువు శృతిపట్నాయక్, కావ్య, పూజ, జయలక్ష్మి, అంకిత, లక్ష్మీప్రీతి, దీక్షిత, స్రవంతి, మధుశ్రీ, అకాడమీ అధ్యక్షులు వెంకటేశ్వర పట్నాయక్ పాల్గొన్నారు.

సిఎం పర్యటన విజయవంతం

ప్రజాశక్తి- పలాస



ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి 200 పడకల ఆస్పత్రి, కిడ్నీ పరిశోధన కేంద్రం, రూ. 700 కోట్లు వ్యయంతో నిర్మాణం చేపట్టిన వైఎస్ఆర్ సుజల స్రవంతి పథకాన్ని ప్రారంభించారు. అందులో భాగంగా కాశీబుగ్గ రైల్వే క్రీడా మైదానంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభను విజయవంతం చేసిన ప్రతీ ఒక్కరికీ రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి సీదిరి అప్పలరాజు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన వైసిపి నాయకులు, కార్యకర్తలు, యువతకు, మహిళలకు ధన్యవాదాలు తెలిపారు. భవిష్యత్తులో ఇదే పంథా కొనసాగిస్తూ నియోజకవర్గాన్ని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు కోరారు.

నేడు వైసిపి విస్తృతస్థాయి సమావేశం

టెక్కలి రూరల్ : టెక్కలి నియోజకవర్గ వైసిపి కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం అదిత్య కళ్యాణ మండపంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ సమావేశానికి నాలుగు మండలాల జెడ్‌పిటిసిలు, మండల అధ్యక్షులు, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, వార్డు సభ్యులు, సచివాలయం కన్వీనర్లు, కార్పొరేషన్ డైరెక్టర్లు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

ఉచిత బస్ సౌకర్యం కల్పించాలి

ఇచ్ఛాపురం : ఇచ్ఛాపురం మండలం నుంచి పలాస కిడ్నీ ఆస్పత్రికి వెళ్లే కిడ్నీ రోగులకు ఉచిత బస్ సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని జెడ్‌పిటిసి ఉప్పాడ నారాయణమ్మ కోరారు. పలాస కిడ్నీ ఆస్పత్రి ప్రారంభానికి వచ్చిన సిఎం జగన్మోహన్‌రెడ్డిని కలిసి గురువారం వినతిపత్రం అందజేశారు. ఇచ్ఛాపురం నుంచి పలాస 50 కిలో మీటర్ల ఉంటుందని, అందుకు కిడ్నీ రోగులకు ఉచిత బస్ సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

మరోసారి బిసిలకు మోసం

కోటబొమ్మాళి: వైసిపి ప్రభుత్వం బిసిలకు అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తానని మాట ఇచ్చి అధికారంలోకి వచ్చిందని, మళ్లీ ఎన్నికలు దగ్గరపడుతున్న తరుణంలో బిసిలకు మళ్లీ మభ్యపెడుతున్నారని, మరోసారి బిసిలకు మోసం చేయలేరని నాయీబ్రహ్మణ బిసి సాధికారిత పార్లమెంట్ కమిటీ కన్వీనర్ కుప్పిలి వెంకటరావు, నాయీబ్రాహ్మణ సంఘం జిల్లా ఉపాధ్యాక్షులు నౌగాపు నాగరాజులు అన్నారు. భవిష్యత్‌కు భరోసా కార్యక్రమంలో భాగంగా స్థానిక నాయీబ్రాహ్మణ కమ్యూనిటీ భవనంలో నాయీబ్రాహ్మణులతో గురువారం సమీక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాయీబ్రాహ్మణుల వెనుకబాటుతనంతో పాటు జరుగుబాటు తనం లేక అనేక కుటుంబాలు సతమతమతున్నాయని అన్నారు. కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యులు నౌగాపు సుశీల, చిగురువలస రాజేశ్వరి, పోతల రామదాసు, పోతల అప్పారావు, తెలగవలస శంకరరావు, టి. మోహనరావు, ప్రసాద్ పాల్గొన్నారు.

సమగ్రంగా భూ సర్వే

ప్రజాశక్తి- సరుబుజ్జిలి

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న భూ రీసర్వే కార్యక్రమాన్ని అధికారులు సక్రమంగా నిర్వహించాలని రెవెన్యూ డివిజనల్ అధికారి సిహెచ్ రంగయ్య సిబ్బందిని ఆదేశించారు. గురువారం మండల కేంద్రంలో తహశీల్దార్ కార్యాలయంలో రీ సర్వే వివరాలను, రికార్డులను పరిశీలించి రీసర్వే డిటి నీలిమకు పలు సూచనలు చేసారు. మండలంలో మతలబుపేటలో భూముల రీసర్వే విషయంలో పలులోపాలు, తప్పులు దొర్లాయని రైతులు ఆర్‌డిఒ దృష్టికి తీసుకురావడంతో ఆయన రికార్డులను పరిశీలించారు. అనంతరం నందికొండ రెవెన్యూ గ్రామంలో నిర్వహిస్తున్న భూ రీసర్వేను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో డిటి పద్మావతి, విఆర్‌ఒ సుజాత, సర్వేయర్లు, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



భూ రీసర్వేను పరిశీలిస్తున్న ఆర్‌డిఒ రంగయ్య

తూనికలు, కొలతలపై అవగాహన

శ్రీకాకుళం: వినియోగదారుల అవగాహనతోనే మార్కెట్‌లో జరిగే మోసాలకు అడ్డుకట్ట వేయవచ్చని తూనికలు, కొలతల శాఖ సహాయ కంట్రోలర్ విశ్వేశ్వరరావు పేర్కొన్నారు. ఈ నెల 24న నిర్వహించనున్న జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని పురస్కరించుకొని అడ్వకేట్స్ అసోసియేషన్ ఫర్ సోషల్ రెస్పాన్సిబిలిటీ అండ్ అవేర్నెస్ (ఆశ్రా) సంస్థ నగరంలో టిపిఎమ్ హైస్కూల్, మున్సిపల్ ఎలిమెంటరీ స్కూళ్లలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థి దశనుంచే చట్టంపై అవగాహన ఉండడం ద్వారా మోసాలు అరికట్టడం సాధ్యమన్నారు. సీనియర్ న్యాయవాది, వాకర్స్ క్లబ్ మాజీ గవర్నర్ ఇందిరాప్రసాద్ వినియోగదారుల చట్టం 2019, వినియోగదారుల హక్కులు, భాధ్యతలపై విద్యార్థులకు వివరించారు. ఆశ్రా జిల్లా అధ్యక్షులు డాక్టర్ గంజి ఎజ్రా అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో ప్రధానోపాధ్యాయులు, ఆశ్రా ప్రతినిధులు లఖినాన రవికుమార్, కట్టా పార్ధసారధి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న విజయకృష్ణ

కంప్యూటర్ విద్యతోనే భవిష్యత్

ఆమదాలవలస: భవిష్యత్ అంతా కంప్యూటర్ రంగందేన ఆమదాలవలస ఇమ్మానుయేల్ కంప్యూటర్ సంస్థ అధినేత పొన్నాడ విజయకృష్ణ అన్నారు. ఆన్ ది జాబ్ ట్రైనింగ్‌లో భాగంగా నరసన్నపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల ఒకేషనల్ విద్యార్థులకు విజయకృష్ణ గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సాంకేతిక నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవడం ద్వారా ఉపాధి అవకాశాలను మనమే సృష్టించుకోవాలని తెలిపారు. నరసన్నపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వావిలపల్లి నారాయణస్వామి సూచనలతో ఒకేషనల్ విద్యార్థులకు కంప్యూటర్ ఎడ్యుకేషన్ ద్వారా ఒకరోజు ఒజెటి కార్యక్రమం నిర్వహించామని అధ్యాపకులు దుగ్గివలస రాంప్రసాద్, కొర్రాయి రవి పేర్కొన్నారు. ఎమ్మెస్ ఎక్సెల్, వర్డ్, పవర్ పాయింట్ ప్రజెంటేషన్,ప్రాక్టికల్స్ నిర్వహించారు.



సిఎం జగన్ పర్యటన దృశ్యమాలిక





















